
# 19

## కాట్రగడ్డ దయానంద్




ఊహ తెలీకముందు నేనెట్లా పెరిగానో గాని ఊహ తెల్సింతర్వాత నాన్నతోడిదే లోకం. అమ్మకు నా పుటకే తెలీదంటాడు నాన్న. నానా అవస్థపడి పంటి బిగువున ఒక రోజంతా బాధనోర్చుకుని నన్నీ గెడ్డన పడేసిన భూదేవతంట మాయమ్మ.

నాన్నకు నేనంటే ఇష్టం. నాన్నకు నేనూ, నాకు నాన్న-మేమిద్దరమే. మాకు మరెవరూ లేరు చుట్టూ ఉన్న ఊరు, ఊళ్ళోని జనం తప్ప!

సద్దికూటివేళ దాకా నన్ను అరకమీద బరువుగా కూర్చోబెట్టి పొలం దున్నుతూ పంచతంత్రం కథలు చెప్పేవాడు నాన్న. అరక వెనక పురుగులకోసం వెంపర్లాడే కొంగల గుంపును చూపిస్తూ కొంగ, చేపల కథ చెప్పేవాడు. అరక విడిచి దోసిళ్ళతో సద్దికూడు తాగినాక మిగిలింది కుక్కలకూ, కాకులకూ పోస్తూ కాకీ కాకీ గవ్వలకాకి పాట నేర్పేవాడు. ఎముకను ముక్కున కరుచుకున్న కాకి, నక్క కథ చెప్పేవాడు.

నాన్న సాలు వేస్తే సక్కగా వంకరపోకుండా ఉంటుందని అంతమంచి సేద్యగాడు ఊళ్ళోనే లేడనే వాళ్ళందరూ.



# చదువు

నడిజామున గుండ్లకమ్మలోకి పశువుల్ని తోలి కంప్రతుమ్మ చెట్ల నీడన సేదతీరి యూరియాగోతాల ప్లాస్టిక్కు దారాలు ఊడతీసి పశువులకి మెడతాళ్ళు, మూతికి చిక్కాలు, మంచాలకు నులక ఎట్లా పేనాలో చుట్టూ ఉన్నవాళ్ళకు నేర్పుతూ చిక్కు ప్రశ్నలు ఎట్లా విప్పాలో చెప్పేవాడు. పని సూక్ష్మం భలే పట్టుకుంటాడని అనేవాళ్ళందరూ. కటికనేల మీద అందరూ నడుం వాల్చిన సమయాన పిల్లల్ని వెంటేసుకుని వెళ్ళి గుండ్లకమ్మలో ఈత కొట్టడం నేర్పేవాడు నాన్న.

ఊళ్ళో గొడ్డు కేదన్నా వాతంకమ్మి లేవకపోతే నాలుగైదు రకాల దుంపలు తవ్వుకొచ్చి బెల్లంతో దంచి గొడ్డుకు పెట్టేవాడు. తెల్లారేసరికల్లా అది పేడ వేసి నెమరు పెడుతూ లేచి నుంచునేది. నాన్న వేసే ఆకు పసురుకి ఎంతటి గాయమైనా మలమలమాడిపోయేది. తేలుకుడితే ఆయన వేసే పుగాకు పసురికి ఎంతటి విషమైనా విరిగిపోవాల్సిందే. అంతటి వైద్యగాడు ఆ చుట్టుపక్కల లేడని చెప్పేవాళ్ళందరూ.

సందేల ఆరుబయట మండే పొయ్యి ముందు కూర్చుని నన్ను దీపం వెలుగులో కూర్చోబెట్టి అక్షరాలు దిద్దమనేవాడు. ఒంట్లు, ఎక్కాలు పలికించేవాడు. ప్రభవ విభవలూ, చైత్రవైశాఖలూ, అశ్వనీ భరణీలూ బడిలో చేర్చేనాటికే కంఠతా నేర్పేడు నాన్న.

రాత్రులు నన్ను గుండెల మీద పడుకోబెట్టుకుని భారతం కథలు చెప్పేవాడు నాన్న. ఏకలవ్యుడి గురించి, విలువిద్య నేర్చుకోవడానికి పడిన పాట్లు గురించి, దక్షిణ పేరుతో విద్యను లాక్కున్న ద్రోణుడి గురించి ఎంతో బాధగా చెప్పేవాడు.

నిద్రలేచింది మొదలు పడుకునేదాకా నాన్న తోడిదే లోకం. నాన్నంటే నాకెంతో ఇష్టం. నాన్నకు నేనూ, నాకు నాన్న!

నాన్నకు చదువన్నా ఇష్టమే. నేనంటే ఎంతిష్టమో చదువంటే అంతకన్నా ఇష్టం. చదువు కోసం నాన్న నన్ను దూరంగా ఉంచడానికైనా సిద్ధపడ్డాడు.

నాకప్పుడు తొమ్మిదేళ్ళో పదేళ్ళో! అయిదో తరగతి! ఏడాది పరీక్షలకు పదిరోజులు ముందు నాకో లావాటి పుస్తకం కొనిచ్చి నన్ను నవోదయ పరీక్షకు సిద్ధం కమ్మన్నాడు నాన్న! మంచి ఎండల్లో పరీక్ష రాస్తే తొలకరి నాటికి సీటొచ్చిందని చెప్పేడు మా బడి పంతులు. ఆయాల నాన్న సంబరం అంతా ఇంతా కాదు. నన్ను భుజమ్మీద కూర్చోబెట్టుకుని గుండ్లకమ్మ ఒడ్డునున్న పొలం చుట్టి వచ్చేడు. రోజంతా ఎన్నో కబుర్లు చెప్పేడు. చదువుకు ఎన్ని మహత్తులున్నాయో చెప్పేడు.

తెల్లారి బడిలో చేరాలనంగా ఆ రోజు రాత్రి నన్ను గుండెల మీద చేర్చుకుని చుక్కల ఆకాశాన్ని చూస్తూ ఇంటి గురించి దిగులు పడొద్దన్నాడు. నాన్న గురించి ఆరాట పడొద్దన్నాడు. ఆకాశంలో కదుల్తున్న చుక్కల్ని చూపిస్తూ పోలీసు అప్పయ్య కొడుకు రాకెట్ కేంద్రంలో పెద్ద సైంటిస్టనీ, ఆ కదిలే చుక్కలు ఆయన పంపిన రాకెట్లనీ చెప్పేడు. చదువుకుంటే అట్టాంటి అద్భుతాలు చాలా చెయ్యొచ్చనీ, నిద్రలో మెలకువొచ్చి చూచినప్పుడల్లా నాన్న చుక్కల ఆకాశంతో మాట్లాడుతూనే ఉన్నాడు.

తెల్లారి ట్రంకుపెట్టె తీసుకుని రెండు బస్సులు మారి అడవి మధ్యలోనున్న బడికి చేరేటప్పటికి పైటాలయింది.

అడవి.... మధ్యలో బ్రహ్మాండమైన భవంతులు.... వాలీబాల్ ఆడుతూ, ఖోఖో ఆడుతూ ఉత్సాహంగా పెద్ద పిల్లల అరుపుల కోలాహలం... చుట్టూ కూర్చుని చూస్తూ బిక్కు బిక్కు మంటూ కొత్తగా చేరిన ఆరవ తరగతి పిల్లలు.... అదంతా చూచి నాన్న సంబరపడ్డాడు. "బడంటే ఇట్టుండాలయ్యా" అంటూ నన్ను ఉత్సాహపరిచేడు. ఆ రాత్రి నాన్న నన్ను విడిచి వెళ్ళగానే దిగులు కమ్ముకుంది. మెలకువొచ్చినప్పుడల్లా నాన్న గుర్తొచ్చి ఒళ్ళంతా జలదరించేది. ఆ రాత్రి నిద్ర కూడా అంతే! జలదరింపుల నిద్ర.

మరునటి రోజు పొద్దున్నే బడిచుట్టూ వందలాదిమంది పిల్లలు వరసగా పరుగెత్తడం.... తర్వాత వ్యాయామం చేయటం! ఆ తర్వాత క్లాసులు- ఎన్ని క్లాసులైతే అంతమంది ఉపాధ్యాయులు- నాకు అబ్బురం తోచింది. మా బడిలో ఒక్క బడిపంతులే ఉండేవాడు. ఇక్కడ అందరూ పాఠాలు ఎంత బాగా చెబుతారో కథలాగా, కలలాగా, అచ్చం నాన్న చెప్పినట్లే. మధ్య మధ్యలో మళ్ళీ కథల క్లాసూ పాటల క్లాసూ వేరే. ఆ ఉత్సాహం నాన్నను కూడా మరిపించేది.

రెండురోజుల తర్వాత రెండు కాళ్ళ మడమల దగ్గర సన్నగా నొప్పి, ఆ నొప్పి రోజురోజుకు పెరిగి వారం తిరిగేసరికి కాళ్ళు రెండూ వాచి నడవలేని స్థితిలో, బడిలో డాక్టరు చూచి బయట ఎముకల డాక్టరు దగ్గరకు పంపేడు. పాదాలు రెండూ సదరంగా ఉండి పరుగెత్తడానికి వ్యాయామం చెయ్యడానికి వీలుగాదన్నాడు. ఎక్కువసేపు కాళ్ళమీద బరువుపెడితే నొప్పి వాపు వస్తాయని చెప్పేడు. కొన్నాళ్ళు పరుగెత్తడం నుంచీ వ్యాయామం నుంచీ మినహాయింపునిచ్చేరు. పరుగెత్తే పిల్లల్ని చూచి పరుగెత్తలేకపోతున్నాననే బాధ, ఆడేవాళ్ళను కూర్చుని చూడాల్సి వచ్చిందన్న దిగులు...

నొప్పి, వాపు తగ్గిన తర్వాత మళ్ళీ ఆడటం పరుగెత్తడం... పాదాలు మళ్ళీ వాచి కదల్లేకపోవటం.... నాన్న వచ్చి మళ్ళీ డాక్టరు దగ్గరకు తీసుకుపోవటం....

నాలుగైదు సార్లు ఇట్లాగే జరిగేక ఆ బడి వదిలిపెట్టాల్సి వచ్చింది. నా చెయ్యి పట్టుకుని బయటకు నడుస్తూ నన్ను చూచి బడిని చూచి భోరుమన్నాడు నాన్న.

× × ×

పక్క ఊరిబడిలో పది అయిపోగానే నన్ను బెజవాడలో చదివించడానికి సిద్ధమయ్యాడు నాన్న. కష్టార్జితం ధారపోసైనా నన్ను చదివించాలని అనేవాడు. కాలేజి వాళ్ళు పెట్టిన పరీక్షలో మార్కులు బాగా వచ్చేయని పదివేలు ఫీజు తగ్గిస్తే నలభైవేలు కట్టి ఎంతో సంబరపడ్డాడు.

అయిదేళ్ళ తర్వాత మళ్ళీ ఎన్నో జాగ్రత్తలు చెప్పేడు నాన్న. బాగా చదవాలన్నాడు. నాన్న గురించి దిగులు పడొద్దన్నాడు. మళ్ళీ పోలీసు అప్పయ్య కొడుకును తలుచుకున్నాడు. బాగా చదివి డాక్టరు సీటు తెచ్చుకోవాలన్నాడు. డాక్టరైతే పొయ్యే ప్రాణాలు కాపాడొచ్చన్నాడు. మనూళ్ళో డాక్టరే ఉంటే నాకు అమ్మ ఉండేదన్నాడు. డాక్టరై మహిమలు చెయ్యాలని చెప్పేడు.

మహానగరం..... నగరం చివర రోడ్డు ప్రక్కన రొదలో పెద్ద ప్రహరీ! ప్రహరీ ముందు నిరంతరం గట్టికాపలా! ఎప్పుడూ వేసి ఉండే పెద్ద గేటు-లోపల

వైపు నాలుగంతస్థుల భవనం—చుట్టూ తరగతి గదుల కోసం రేకులషెడ్లు....

అయిదు గంటలకు నిద్ర లేవటమే టెన్షన్! ఖాళీ బాత్‌రూం దొరుకుతుందో లేదోనన్న భయం.... దొరక్కపోతే క్లాసులకు ఆలస్యంగా పోవడం... హూంకరింపులు, బెదిరింపులు... ప్రిన్సిపాల్‌గా ఎక్స్ సర్వీస్‌మ్యాన్ కావాలని ప్రకటనిచ్చి మరీ పిలిపించారంట - ఆరడుగుల పైనుంటాడు. పసిపిల్లలు దడుచుకునేట్టు బూచాడిలా ఉంటాడు. క్లాసులకు ఆలస్యమైతే బెత్తం పట్టుకుని మరీ సిద్ధంగా ఉంటాడు.

ఒంటిగంటకు క్లాసులు కాగానే భోజనం... తర్వాత ఒక గంట విరామం - ఆ గంటలోనే పిల్లలందరూ రూముల్లో చేరి తలుపులేసుకుని పగల్ని చీకటి చేసి ముసుగులేసుకునో, కళ్ళ మీద కందువాలు కప్పుకునో కునుకు తియ్యబోయేంతలో బయ్యిమంటూ మోగే గంట శబ్దం... తలుపులు తెరవమని దబదబమని మోత.... మళ్ళీ చదవడానికి సిద్ధం కావాలి. ఏమాత్రం ఆలస్యమైనా హూంకరింపులు.... బెదిరింపులు, బెత్తం చదువులు- సాయంత్రం దాకా బట్టీపట్టడం... మరో అరగంట విరామం... మళ్ళీ చదువు రాత్రి పదకొండు గంటలదాకా...

ఇక్కడ చేరేముందు నవోదయలోలాగా ఆటలుంటాయనుకున్నాను. పాటలు పాడిస్తారనుకున్నాను. ఆమాటే నాన్నతో అంటే "ఆట పాటల దేముంది నాయనా! చదువు ముఖ్యం" అన్నాడు.

ఒకరోజు నిద్ర లేచేసరికి బాత్‌రూం దొరకడం కష్టమై క్లాసులకు ఆలస్యమైంది. ఎక్స్‌సర్వీసు ప్రిన్సిపాల్ వాకిట్లోనే తిష్టవేశాడు. అదృష్టవశాత్తు చేతిలో బెత్తం లేదని సంతోషపడ్డాను. ఆలస్యమైనందుకు సంజాయిషీ అడక్కుండానే ఎగిసి తలతో నా తలను ఢీకొట్టేడు. కళ్ళు గిర్రున తిరిగేయి. తలలో చుక్కలు మెరిసేయి. క్లాసుల్లోంచి చూస్తున్న పిల్లల కళ్ళు.... గొప్ప అవమానం, ఒక మృగం దాడిచేసి తలపై మోదిన భయంకరమైన బాధ....

ఆ రాత్రంతా నిద్రే లేదు. గోడ దూకి పారిపోదామన్న ఆలోచన.... నాన్న గుర్తొచ్చేడు. గదిలో పక్క మంచం స్నేహితుడు సానుభూతిగా మాట్లాడితే తెల్లారేసరికి వాడి గదిని మార్చేసేరు.

ఎప్పుడూ నిఘా! చదువుతున్నాడో లేదో నిఘా! వారం వారం పరీక్షల్లో మార్కులు బాగా వస్తున్నాయో లేదో నిఘా! మార్కులు తగ్గితే క్లాసులో లెక్చరర్ల పోస్ట్‌మార్టం - చెప్పింది ఫాలో కావడం లేదని గుంజిల్లు తీయించడం - అవమానకరంగా మాట్లాడటం - ఏ ఇద్దరు పిల్లలైనా స్నేహంగా ఉంటే తెల్లారేసరికి వాళ్ళ క్లాసులు మారతాయి.

ఒక ఆదివారం నాన్నొచ్చి దుర్గగుడికి తీసుకెడతానని ప్రిన్సిపాల్‌ను అడిగేడు. ప్రిన్సిపాల్ నాన్నను ఎగాదిగా ఛీత్కారంతో చూచేడం. అడగకూడనిది అడిగినట్లు మొహంపెట్టి "ఒక పూట చదువుపోతే ఎవరికి నష్టం. మీకా? నాకా? ఎందుకు బయటకు తీసుకెళ్ళి వాడి చదువుని చెడగొట్టడం - ఒక పూట వాడు చదవకపోతే వాడి వెనకాల ఉన్నవాడు వాడికంటే ముందుకు పోతాడా లేదా?" అని ఆగి మొహం వికారంగా పెట్టి "చదువు విలువ తెలిస్తే కదా! ఇంకెప్పుడూ పిల్లవాడిని బయటకు పంపమని అడగొద్దు" అన్నాడు.

నాన్న చిన్నబుచ్చుకుని తనని తాను చూచుకున్నాడు.

మోకాళ్ళ కిందకు పంచె, తెల్లగా బూజురేగిన పాదాలు, మట్టి గొట్టుకున్న చెప్పులు, మాసిన పై కండువా.... వెడుతూ, వెడుతూ "జాగ్రత్త నాయనా, వాడు ద్రోణాచార్యుడి సంతతి లాగున్నాడు" అంటూ వెళ్ళిపోయాడు.

మొదటి సంవత్సరం మార్కులు బాగా వచ్చేయని నాన్న సంతోషపడ్డా రెండో సంవత్సరం యాభైవేలు కట్టడం నాన్నకు కష్టమే అయింది. అప్పుడు కాస్తా అప్పుడు కాస్తా పరీక్షల నాటికి పూర్తిగా కడతానని చెప్పేడు.

ఎండాకాలం నాలుగు రోజులు సెలవులని ఊరికెడితే -

నాన్న ఒక్కపూటా ఇంటిపట్టున ఉండింది లేదు. కోతలనీ, కయిళ్ళనీ, గడ్డివాములనీ క్షణం తీరిక లేకుండా ఉన్నాడు. అంతకుముందు మాకున్న దాంట్లోనే సేద్యం చేసేవాడు. ఇప్పుడు ఊళ్ళో వాళ్ళ పన్లక్కూడా వెడుతున్నాడు. కొత్తగా టైరు బండి ఒకటి చేయించి మిల్లుకు బాడుగలు తోలుతున్నాడు. తెల్లారగట్ల ఇంత వండుకుని బండి గట్టుకుని వెడితే రాత్రి ఏ జామునో ఇంటికి చేరడం - ఎప్పుడు వస్తున్నాడో తెలీదు. ఏం తింటున్నాడో తెలీదు. అసలు తింటున్నాడో లేదో తెలీదు.

బయలుదేరేముందు ఇదేమిటని నిలదీస్తే "నా కష్టం దేముంది నాయనా. నా మాటలు గుర్తు పెట్టుకుని బాగా చదువుకో" అన్నాడు. నాలుగే నాలుగు రోజుల సెలవుల తర్వాత ఎండాకాలంలోనే రెండో సంవత్సరం క్లాసులు మొదలు - ఈసారి మరీ హడావుడి...

"ఇట్లా అయితే లాభం లేదు. బార్డరులో ఉన్నారు. ఎటూ కాకుండా పోతారు. చదవాలి. చదవాలి. ర్యాంకులు రావాలి. ర్యాంకులు తేవాలి" ఎక్స్ సర్వీసు ప్రిన్సిపాలు.

"చెప్పింది సరిగ్గా చెయ్యడం లేదు. తల తిరుగుతోందా?" లెక్చరర్లు.

"ఫీజులేమో మనం కట్టాలి. ఫ్రీగా చేరిన మెరిట్ బ్యాచీలకి మంచి మెటీరియల్ మంచి లెక్చరర్లు. ఇదేం న్యాయంరా?" చదువులో వెనకబడ్డ పిల్లల ఆవేదన.

పరీక్షలు దగ్గరకొచ్చేయి. ప్రాక్టికల్ పరీక్షలు మొదలయ్యేయి. రికార్డులు రాయించకుండానే పాత రికార్డులకు కొత్త అట్టలు వేసి ముస్తాబు చేసి పేర్లు రాసి అవే పిల్లలకిచ్చేరు. తొలిరోజు బాగానే జరిగింది. ఫిజిక్స్ ప్రాక్టికల్స్ రోజు నా రికార్డు పట్టుకున్నాడు ఇన్విజిలేటర్లు. నా చేత దస్తూరి రాయించి రికార్డుతో సరి చూచేడు.

"నిజం చెప్పు రికార్డు రాసిందెవ"రన్నారు. నిజం చెబితే వదిలిపెడతానని కూడా అన్నాడు. భయమేసింది. రికార్డులు కాలేజీలో ఇచ్చేరని చెప్పేను. అందరి రికార్డులు కట్టగట్టి మార్కులు వెయ్యకుండా పక్కనపెట్టేరు. కాలేజికి కబురు వెళ్ళింది. ప్రిన్సిపాల్ హడావుడిగా వచ్చేడు.

ఆ సాయంత్రం ప్రిన్సిపాలు భీకరంగా ఉన్నాడు. ఖడ్గమృగం లాగున్నాడు. వీలైతే కసుక్కున మెడ కొరకేట్టున్నాడు. అందరి ముందు నిప్పులు ఉమిసేడు.

"ఏరా! నువ్వేమన్నా సత్యహరిశ్చంద్రుడివా? నువ్వు పొయ్యేది గాక మెరిట్లో ఉండేవాళ్ళనీ, టాప్ టెన్‌లో ఉండేవాళ్ళనీ ఇరికించేవు. మీకోసమని రికార్డులిస్తే బట్టబయలు చేసి నాకెంత నష్టం తెచ్చేవో తెల్సా" అంటూ తనకు వచ్చిన బూతులన్నీ తిట్టేడు.

బతుకుమీదే రోత పుట్టేట్టు అవమానంగా మాట్లాడేడు. చుట్టూ వందలాదిమంది పిల్లలు - లెక్చరర్లు - చేతులు కట్టుకుని నేలను కరుచుకున్న నా చూపులు - గొప్ప దుఃఖం.... ఒళ్ళంతా గడ్డకట్టుకు పోయినట్లు అక్కడ్నుంచి మాయమై ఎటన్నా ఎగిరిపోతే బాగుండునన్న ఆలోచన.... ఆ రాత్రి నాన్నే రాకపోతే ఏమైఉండేదో.

రాత్రి పది తర్వాత నాన్నొచ్చేడు. నాన్నతోనూ అట్లాగే మాట్లాడేడు. పదివేలు ఖర్చయిందన్నాడు. అది కడితేనే ఆఖరున టీసీ ఇచ్చేదన్నాడు. సరేనన్నాడు నాన్న.

గదిలోకొచ్చేక నాన్నను గట్టిగా పట్టుకున్నాను. ఎక్కడో మహాపర్వతం విరిగిపడ్డట్టు పెటిల్లిన పగిలిన దుఃఖం... పెద్దగా ఏడ్చేను. వెక్కి వెక్కి ఏడ్చేను. నాన్న నన్ను ఆనుకుని ఒళ్ళంతా తడిమేడు. కందువాతో కళ్ళు తుడిచి. "ఊరుకో నాన్నా! వాళ్ళకివ్వాల్సింది వాళ్ళకివ్వ కుండా వీడు తప్పించుకోవాలని చూచేడంట. వాళ్ళు అంతకంత వసూలు చేసేరంట. అదీ వీడి బాధ".

ఆ రాత్రంతా నాన్న నా పక్కనే ఉండి ఓదారుస్తూనే ఉన్నాడు.

మరో నెలకు పరీక్షలన్నీ అయిపోయి ఊరికెడితే నాన్న ఎదురొచ్చి "చదువులేని మూర్ఖున్ని. గదా! నాకేం తెల్సు నాయనా చదువులిట్టా ఉంటాయని, చదువు పేరుతో ఈ రెండేళ్ళు నిన్నెంత హింస పెట్టేన్రా" అంటూ నా పుస్తకాల పెట్టెను అందుకున్నాడు.